## ప్రజా సమస్యల పరిష్కారానికి మరింత కృషి చేయాలి

- భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి

యాదాద్రి భువనగిరి, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ) : అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి సూచించారు. కలెక్టరేట్‌లో ఎంపీ అధ్యక్షతన బుధవారం దిశ సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల అభివృద్ధి పనులపై అధికారులతో చర్చించి సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే సమస్యలను పరిష్కరించే విధంగా అధికారులు మరింత కృషి చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయిస్తున్న నిధులను సక్రమంగా వినియోగించుకునే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. జాతీయ రహదారుల పనులు వేగవంతమయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. కేంద్ర పథకాల గురించి ప్రజలకు అవగాహన కలిగించేలా లబ్ధిదారులను చైతన్యం చేయాలని సూచించారు. సమావేశంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్ హనుమంతరావు, అదనపు కలెక్టర్ వీరారెడ్డి, జడ్పీ సీఈఓ శోభారాణి, డీఆర్‌డీఓ నాగిరెడ్డి పాల్గొన్నారు.

## ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

బీబీనగర్, ఏప్రిల్ 16 : రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో ఏకేపీ ఆధ్వర్యంలో, చిన్నరావులపల్లిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుల అభ్యున్నతే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. రైతులు దళారులను నమ్మకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఏట పద్మ, స్పెషల్ ఆఫీసర్ ఉష, ఏపీఎం శ్రీనివాస్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ గడ్డం బాలకృష్ణగౌడ్, సీఈఓ శివశంకర్, ఆర్ఐ వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు గోలి పింగళ్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సత్యమతి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ దేవీసింగ్, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## పీఏసీఎస్ భవన నిర్మాణ పనులను త్వరలో ప్రారంభిస్తాం

- డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి



ధాన్యం తేమ శాతం చూస్తున్న డీసీసీబీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

సంస్థాన్ నారాయణపురం, ఏప్రిల్ 16 : మండల కేంద్రంలో శిథిలావస్థకు చేరుకున్న పీఏసీఎస్ భవనం స్థానంలో కొత్త భవనం నిర్మించడానికి ప్రణాళికలు సిద్ధం చేశామని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ చైర్మన్ జక్కిడి జంగారెడ్డితో కలిసి బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్ముకుని మద్దతు ధర పొందాలన్నారు. మండల కేంద్రంలో డీసీసీబీ బ్యాంకు ఏర్పాటు పనులు పూర్తయ్యాయని, త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు.

## రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు

మోటకొండూర్, ఏప్రిల్ 16 : రైతులు పండించిన పంటను దళారులకు అమ్మి మోసపోవద్దని మార్కెట్ కమిటీ చైర్మన్ ఐనాల చైతన్యరెడ్డి అన్నారు. మండలంలోని ఇక్కుర్తి, దిలావర్‌పూర్, కాటేపల్లి, కొండాపూర్, కదిరేణిగూడెం గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం కనీస మద్దతు ధర అందిస్తూ ధాన్యం అమ్మిన వెంటనే రైతుల ఖాతాలో జమ చేస్తుందన్నారు. దళారులకు తక్కువ ధరకు అమ్మి నష్టపోవద్దని, రైతులంతా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలని సూచించారు. ఆలేరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పచ్చిమట్ల మదార్‌గౌడ్, ఎంపీడీఓ ఇందిర, ఏపీఎం సత్యనారాయణ, ఆర్ఐ రామారావు, మండల సమాఖ్య అధ్యక్షురాలు కవిత, సీసీలు మల్లేశ్, సంతోష పాల్గొన్నారు.

## 'ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి'

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 16 : ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని భువనగిరి పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఎడ్ల సత్తిరెడ్డి అన్నారు. మండలంలోని హనుమాపురం గ్రామ పరిధిలో భువనగిరి పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు పండించిన పంటను కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి ప్రభుత్వం అందించే మద్దతు ధర పొందాలన్నారు. కమీషన్ దారులను ఆశ్రయిస్తే తక్కువ ధర వస్తుందని, దీంతో రైతులు మోసపోతారని తెలిపారు. కార్యక్రమంలో ఏఓ మాధురి, సింగిల్ విండో డైరెక్టర్ దయ్యాల నర్సింహ, మానిటరింగ్ ఆఫీసర్ ఫరీద్ అహ్మద్, సీఈఓ చారి, రైతులు పాల్గొన్నారు.

### పలు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

వలిగొండ : మండలంలోని సంగెం, వర్కట్‌పల్లి, గోకారం, జాలుకాలువ, బూర్లగడ్డ, నెమిలకాల్వ, లోతుకుంట, నర్సయ్యగూడెం, లింగరాజుపల్లి, అక్కంపల్లి, నాతాళ్లగూడెం, మాందాపురం, రెడ్లరేపాక గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మార్కెట్ కమిటీ చైర్మన్ భీమానాయక్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు నాణ్యత ప్రమాణాలు పాటించి ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి మద్దతు ధర పొందాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం జానీ, మహిళా సంఘాల అధ్యక్షులు, రైతులు పాల్గొన్నారు.

### చౌటుప్పల్ మండలంలో..

చౌటుప్పల్ రూరల్ : మండలంలోని ఎస్.లింగోటం, నేలపట్ల, మందొళ్లగూడెం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పీఏసీఎస్ చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, తాసీల్దార్ హరికృష్ణ, ఏఈఓ నాగరాజు, ఏసీ నాయక్, భద్రయ్య, అంజయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

### యాదగిరిగుట్ట మండలంలో..

యాదగిరిగుట్ట : మండలంలోని మైలారిగూడెం, మల్లాపురం గ్రామాల్లో యాదగిరిగుట్ట పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సొసైటీ చైర్మన్ ఇమ్మడి రామిరెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఉపయోగకరంగా కొనుగోలు కేంద్రాలను అందుబాటులో ఉంచామన్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈఓ ఆంజనేయులు, బీఆర్ఎస్ బీసీ విభాగం మండలాధ్యక్షుడు కవిడె మహేందర్, రైతులు పాల్గొన్నారు.

## పోచంపల్లి ఇక్కత్ వస్త్రాల విశిష్టతను విశ్వవ్యాప్తం చేస్తాం

- రాష్ట్ర పర్యాటక శాఖ కార్యదర్శి స్మితా సబర్వాల్



చేనేత కార్మికుడితో మాట్లాడుతున్న రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక శాఖ కార్యదర్శి స్మితా సబర్వాల్, చిత్రంలో కలెక్టర్ హనుమంతరావు

భూదాన్ పోచంపల్లి, ఏప్రిల్ 16 : పోచంపల్లి ఇక్కత్ వస్త్రాల విశిష్టతను విశ్వవ్యాప్తం చేస్తామని రాష్ట్ర పర్యాటక శాఖ కార్యదర్శి స్మితా సబర్వాల్ అన్నారు. పోచంపల్లి పట్టణంలో బుధవారం జిల్లా కలెక్టర్ హనుమంతరావుతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మే 15న 145 దేశాలకు చెందిన విశ్వసుందరీలతో హైదరాబాద్‌లో ఫ్యాషన్ షో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా సుమారు 40 దేశాల విశ్వసుందరీలు భూదాన్ పోచంపల్లిని సందర్శించనున్నట్లు తెలిపారు. మిస్ వరల్డ్ ఈవెంట్ ద్వారా పోచంపల్లి ఇక్కత్ బ్రాండ్‌ను పరిచయం చేసేందుకు తగిన ఏర్పాట్లను పరిశీలించారు. అంతకు ముందు భూదానోద్యమ చిత్రాలను, చేనేత మగ్గాలను పరిశీలించారు. కార్మికుల జీవనంపై, చేనేత వృత్తి విధానంపై కార్మికులతో చర్చించారు. హ్యాండ్లూమ్‌ను విశ్వవ్యాప్తం చేసే ఉద్దేశంతో మిస్ వరల్డ్ పోటీల్లో చేనేత చీరెలను ధరించి ర్యాంపు వాక్ చేసేలా కార్యక్రమం రూపొందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమం నిర్వహణకు అధికారులకు ప్రత్యేక సూచనలు చేశారు. ఈ కార్యక్రమంతో మరోసారి పోచంపల్లి ఖ్యాతి విశ్వవ్యాప్తం కానున్నదని పేర్కొన్నారు. కార్యక్రమంలో చేనేత జౌళి శాఖ ఏడీ శ్రీనివాస్, చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్‌రెడ్డి, డిప్యూటీ తాసీల్దార్ నాగేశ్వర్‌రావు, టూరిజం, మున్సిపల్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్వీ పాదయాత్రకు సంఘీభావం



వలిగొండ : పాదయాత్ర చేస్తున్న బీఆర్ఎస్వీ నాయకులకు పూల మాల వేసి సంఘీభావం తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

వలిగొండ, ఏప్రిల్ 16 : బీఆర్ఎస్ రజతోత్సవ సభ జయప్రదం కావాలని కోరుతూ పార్టీ విద్యార్థి, యువజన విభాగాల నాయకులు చేపట్టిన పాదయాత్ర బుధవారం రెండో రోజు వలిగొండ మండల కేంద్రం నుంచి అక్కంపల్లి, మాందాపురం, టేకులసోమారం గ్రామాల మీదుగా భువనగిరి మండలం నాగిరెడ్డిపల్లి గ్రామానికి చేరుకుంది. పాదయాత్ర చేస్తున్న వల్లమాల కృష్ణ, బూర్గు నవీన్‌తోపాటు అందులో పాల్గొన్న నాయకులకు మోత్కూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చిప్పలపల్లి మహేంద్రనాథ్, దాసరి పాండు సంఘీభావం తెలిపారు. వారికి పూలమాల వేసి అభినందించారు. కార్యక్రమంలో శిగ వెంకట్, నాగారం ప్రశాంత్, బాలెంల అవినాశ్, నలపరాజు రమేశ్, నాగరాజు, కిరణ్, నవీన్‌కుమార్, విద్యాసాగర్, ప్రవీణ్, మల్లేశ్ పాల్గొన్నారు.

చౌటుప్పల్ : వరంగల్ సభ విజయవంతం కావాలని బీఆర్ఎస్వీ చేపట్టిన పాదయాత్రకు భువనగిరిలో బీఆర్ఎస్ పార్టీ చౌటుప్పల్ మండలాధ్యక్షుడు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్ సభకు పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద సంఖ్యలో వచ్చేందుకు సిద్ధమయ్యారని తెలిపారు. బీఆర్ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షుడు నలపరాజు రమేశ్, నాయకులు కొత్త పర్వతాలు యాదవ్, ఆడెపు సురేశ్‌కుమార్, నీళ్ల శేఖర్, నక్క సుధీర్, తరుణ్‌నాయక్, గంగాదేవి శివ, చుక్క స్వామి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

### ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య



చౌటుప్పల్, ఏప్రిల్ 16 : పట్టణంలోని గణేశ్‌నగర్‌లో ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కృష్ణా జిల్లా గన్నవరం మండలం బుద్ధవరం గ్రామానికి చెందిన పందేటి చలపతిరావు (38) 20 సంవత్సరాల నుంచి చౌటుప్పల్ పట్టణంలో నివాసముంటూ లింగోజిగూడెంలోని దివీస్ పరిశ్రమలో హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులు రావడంతో జీవితంపై విరక్తి చెంది మంగళవారం ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆత్మహత్యకు గల పూర్తి కారణాలు తెలియవని మృతుడి తండ్రి వీరరాజు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ మన్మథకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### గంజాయి విక్రేత అరెస్ట్

బీబీనగర్, ఏప్రిల్ 16 : గంజాయి విక్రయదారుడిని పోలీసులు అరెస్టు చేశారు. సీఐ ఎం.ప్రభాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్తాన్ రాష్ట్రం నగౌర్ జిల్లాకు చెందిన మొయినుద్దీన్ (26) మండలంలోని జమీలాపేట్ గ్రామంలో పెయింటింగ్ పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో రాజస్తాన్ రాష్ట్రానికి చెందిన అనిల్ అనే వ్యక్తి వద్ద గంజాయిని తక్కువ ధరకు కొని చిన్న ప్యాకెట్లుగా చేసి స్థానికులకు అమ్మాలని నిర్ణయించుకున్నాడు. మంగళవారం సాయంత్రం రాజస్తాన్ నుంచి 900 గ్రాముల గంజాయిని తీసుకుని జమీలాపేట్ గ్రామానికి వస్తుండగా.. గ్రామ శివారులో పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించాడు. పోలీసులు అతడిని పట్టుకుని విచారించి 900 గ్రాముల గంజాయిని గుర్తించారు. సరుకు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. గంజాయి రవాణా చేసినా, వినియోగించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

- గ్రామస్తుల సహకారంతో దహన సంస్కారాలు

ఆత్మకూరు(ఎం), ఏప్రిల్ 16 : మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఎర్ర నరేందర్‌రెడ్డి (35) రోడ్డు ప్రమాదంలో గాయపడి ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందాడు. నిరుపేద అయిన సురేందర్‌రెడ్డి కుటుంబంతో కలిసి హైదరాబాద్‌లో నివాసం ఉంటూ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఉగాది పండుగ రోజు హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. 15రోజుల నుంచి దవాఖానలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతదేహాన్ని బుధవారం స్వగ్రామమైన పోతిరెడ్డిపల్లికి తీసుకొచ్చారు. గ్రామస్తుల ఆర్థిక సాయంతో అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడికి భార్య, 4నెలల బాబు ఉన్నారు.

### గుట్ట పాలిటెక్నిక్ కళాశాలలో ఉచిత శిక్షణ తరగతులు

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 16 : టీజీ పాలీసెట్-2025 ప్రవేశ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 28నుంచి మే 8వరకు పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకులతో శిక్షణ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 19న ప్రవేశ పరీక్షకు చివరి గడువని తెలిపారు. పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష మే 13న జరుగుతుందని వివరించారు. మరిన్ని వివరాలకు 8099899793, 9010629270 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

### ఇందిరమ్మ ఇండ్ల ఎంపికపై సమావేశం

ఆత్మకూరు(ఎం), ఏప్రిల్ 16 : ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికపై మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులతో బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రాములునాయక్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల కోసం మండల వ్యాప్తంగా 2003 దరఖాస్తులు వచ్చాయన్నారు. గ్రామాల్లో అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసి వివరాలు అందించాలని సూచించారు. సమావేశంలో ఎంపీఓ పద్మావతి, సూపరింటెండెంట్ లోకేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

## నేటి డిగ్రీ వార్షిక పరీక్షలు బహిష్కరణ

- తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ, పీజీ అఫ్లియేటెడ్ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ రాష్ట్ర ప్రెసిడెంట్ సూర్యనారాయణరెడ్డి



రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకృష్ణారెడ్డికి డిగ్రీ పరీక్షల బహిష్కరణ పత్రాన్ని అందజేస్తున్న సూర్యనారాయణరెడ్డి

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 16 : గురువారం జరుగాల్సిన డిగ్రీ పరీక్షలను బహిష్కరిస్తున్నామని, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలయ్యే వరకు పరీక్షలు కొనసాగించలేమని తెలంగాణ రాష్ట్ర ప్రైవేటు డిగ్రీ, పీజీ అఫ్లియేటెడ్ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బొజ్జ సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఈ మేరకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకృష్ణారెడ్డికి హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలలు ప్రభుత్వం చెల్లించే ఫీజు రీయింబర్స్‌మెంట్ మీద ఆధారపడి ఉన్నాయన్నారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకపోవడంతో ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు అప్పులు చేసి వడ్డీలు కట్టలేని పరిస్థితి వచ్చిందని తెలిపారు. ప్రభుత్వానికి అనేక సార్లు విన్నవించినా ఫలితం లేకపోవడంతో పరీక్షలను బహిష్కరిస్తున్నామని చెప్పారు.

ఆయనతోపాటు మహాత్మాగాంధీ యూనివర్సిటీ ఫైనాన్స్ సెక్రటరీ దరిపల్లి ప్రవీణ్‌కుమార్ ఉన్నారు.


## 'దాతలందరికీ సమ ప్రాధాన్యం ఇవ్వాలి'



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణగౌడ్

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 16 : పూర్ణగిరి సుదర్శన లక్ష్మీనర్సింహస్వామి దేవాలయం వద్ద అభివృద్ధి జరిపించాలి. కానీ.. దొరపాలన సరికాదని ఆలయ మాజీ చైర్మన్ అతికం లక్ష్మీనారాయణగౌడ్ అన్నారు. పట్టణంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని నమాత్‌పల్లి గ్రామ పరిధిలోగల పూర్ణగిరి సుదర్శన లక్ష్మీనర్సింహస్వామి ఆలయం పురాతనమైందని, బత్తిని రాములుగౌడ్ అనే భక్తుడి వల్లే ఆలయం వెలుగులోకి వచ్చిందని అన్నారు. ఆలయం అభివృద్ధికి కోటి రూపాయలు ఇచ్చిన వారు, పది వేలు ఇచ్చిన వారు కూడా దాతలేనన్నారు. ఎక్కువ డబ్బులు ఇచ్చిన ఒకరి పేరు మాత్రమే వెలుగులోకి తెచ్చి మిగతా వారి పేర్లను ప్రస్తావించకపోవడం సరికాదని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి సహకారంతో తాను చైర్మన్‌గా ఉన్నప్పుడు కోటి రూపాయలతో గుడి చుట్టూ సీసీ రోడ్డు, మౌలిక వసతులు కల్పించామని తెలిపారు. స్థానికేతరుడైన ప్రస్తుత చైర్మన్ రావి సురేందర్‌రెడ్డి రాజకీయం చేస్తూ గ్రామస్తులను అవమానపరుస్తున్నారని ఆరోపించారు. ఆలయం అభివృద్ధి చేసిన భక్తుడు బత్తిని రాములును గుడి వద్దకు రావద్దని అతనిపై కేసు పెట్టించి అవమానించడం సమంజసం కాదన్నారు. ఆలయంలో పనిచేస్తున్న బత్తిని వెంకటేశం, ఎల్లెంల పుష్పమ్మకు 7నెలల జీతం ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాడని తెలిపారు. గిరి ప్రదక్షిణ మార్గంలో ఓ భక్తుడు మట్టి పోయిస్తే తన ఫామ్‌హౌజ్‌కు 18 ట్రాక్టర్ల మట్టిని తరలించుకున్నాడని, ఈ విషయంపై నిలదీసిన ఒకరిని బెదిరించి భయభ్రాంతులకు గురిచేశాడని అన్నారు. ఆలయ చైర్మన్‌గా గ్రామానికి చెందిన వ్యక్తినే నియమించాలని కోరారు. సిబ్బందికి 7నెలల పెండింగ్ వేతనాలను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆలయ మాజీ ధర్మకర్త కంబాలపల్లి ఆంజనేయులు, గ్రామస్తులు పబ్బతి జంగయ్య, జిట్టా చంద్రారెడ్డి, తెల్జూరి మల్లేశ్‌యాదవ్, బత్తిని వెంకటేశ్, కొండాపురం ఉపేందర్ పాల్గొన్నారు.

## పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి : అశోక్‌రెడ్డి



పొలాలను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

రామన్నపేట, ఏప్రిల్ 16 : వడగండ్ల వానతో పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.30వేలు ఇచ్చి ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని నీర్నెముల గ్రామంలో వడగండ్ల వానతో దెబ్బతిన్న పొలాలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టం అంచనా వేయాలన్నారు. గ్రామంలో సుమారు 250 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని తెలిపారు. పంట చేతికొచ్చే సమయంలో రైతులు నష్టపోయారన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జెల్లెల పెంటయ్య, మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, రైతు సంఘం మండల కార్యదర్శి బోయిని ఆనంద్, మాజీ వైస్ ఎంపీపీ నాగటి ఉపేందర్, నాయకులు బల్గూరి అంజయ్య పాల్గొన్నారు.

## నేడు బీఆర్ఎస్ మండల స్థాయి సన్నాహక సమావేశం

- ఆ పార్టీ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 16 : బీఆర్ఎస్ రజతోత్సవ సభ విజయవంతానికి యాదగిరిగుట్ట పట్టణంలోని మున్నూరు కాపు సత్రంలో గురువారం మండల స్థాయి సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య తెలిపారు. పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీత, బూడిద భిక్షమయ్యగౌడ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, పార్టీ భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి క్యామ మల్లేశ్ హాజరవుతారని తెలిపారు. బీఆర్ఎస్ ఆవిర్భావ సభకు వచ్చేందుకు మండల ప్రజలు ఉత్సాహంగా ఉన్నారన్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సన్నాహక సమావేశానికి మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ, అనుబంధ సంఘాల నాయకులు హాజరు కావాలని కోరారు. సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ ఇమ్మడి రామిరెడ్డి, పట్టణ సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి, మండల సెక్రటరీ జనరల్ కసావు శ్రీనివాస్, నాయకులు మిట్ట వెంకటయ్య, గుండ్లపల్లి వెంకటేశ్‌గౌడ్, శ్రీనివాస్, మహేందర్, శ్రీధర్‌గౌడ్, పురుషోత్తం, రాజేశ్‌యాదవ్, సుధాకర్ పాల్గొన్నారు.

## 19న మోటకొండూరు మండల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు యాదయ్య

మోటకొండూర్, ఏప్రిల్ 16 : మండల కేంద్రంలో ఈ నెల 19న బీఆర్ఎస్ మండల సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండలాధ్యక్షుడు బొట్ల యాదయ్య అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమావేశానికి మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీత, బూడిద భిక్షమయ్యగౌడ్, డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కల్లూరి రామచంద్రారెడ్డి రానున్నారని తెలిపారు. సమావేశంలో మాజీ ఎంపీటీసీ పన్నాల అంజిరెడ్డి, బీఆర్ఎస్వై నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి జివిలికపల్లి వెంకటేశ్, నాయకులు బొట్ల మహేశ్, జహంగీర్, లక్ష్మీనారాయణ, భిక్షపతి, చంద్రం, ప్రశాంత్, నరేశ్, రాజు, ఐలయ్య, భాను పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ సమావేశానికి మండల నాయకులు రావాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు చందర్‌గౌడ్

ఆత్మకూరు(ఎం), ఏప్రిల్ 16 : మండల కేంద్రంలో ఈ నెల 22న బీఆర్ఎస్ మండల స్థాయి సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండలాధ్యక్షుడు బీసు చందర్‌గౌడ్ తెలిపారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సన్నాహక సమావేశానికి ప్రభుత్వ మాజీ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్, బీఆర్ఎస్ భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి క్యామ మల్లేశ్ హాజరవుతారని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని కోరారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల సెక్రటరీ జనరల్ పంజాల వెంకటేశ్‌గౌడ్, యాస రంగారెడ్డి, జిల్లా నాయకులు యాస ఇంద్రారెడ్డి, భిక్షపతి, దశరథగౌడ్, సత్యనారాయణ, అజీమొద్దీన్, ఏలెందర్, వెంకట్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి పాల్గొన్నారు.

## 'ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలి'



వెల్వర్తిలో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

వలిగొండ, ఏప్రిల్ 16 : మండలంలోని వెల్వర్తి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వెంటనే ప్రారంభించాలని రైతు సంఘం మండల నాయకుడు కందాడి సత్తిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం రైతులతో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం కాక రైతులు ధాన్యాన్ని దళారులకు అమ్ముకొని ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చి అమ్మకానికి సిద్ధం చేశారని తెలిపారు. అధికారుల నిర్లక్ష్యంతో కొనుగోలు కేంద్రం ప్రారంభానికి నోచుకోలేదని విమర్శించారు. అధికారులు స్పందించి తక్షణమే కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు కల్కూరి ముత్యాలు, కంచర్ల మధుసూదన్‌రెడ్డి, లక్ష్మయ్య, నర్సింహ, మణికాంత్, బాలకృష్ణ, గంగాధర్, చంద్రయ్య, భాగ్యమ్మ, స్వరూప, మంగమ్మ పాల్గొన్నారు.

## 'భూదాన వజ్రోత్సవాలను జయప్రదం చేయాలి'



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

భూదాన్ పోచంపల్లి, ఏప్రిల్ 16 : భూదాన్ జయంతి వజ్రోత్సవాలను జయప్రదం చేయాలని గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యానాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని వినోబా మందిరంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 18న వినోబా మందిరంలో నిర్వహించే వజ్రోత్సవంలో ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర రైతు కమిషన్ చైర్మన్ ఎం.కోదండరాంరెడ్డి, వినోబానగర్ డైవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు గున్న రాజేందర్‌రెడ్డి, సుప్రీంకోర్టు సీనియర్ అడ్వకేట్ పి.నిరూప్, రాష్ట్ర భూ భారతి సభ్యులు ఎం.సునీల్ పాల్గొంటారని తెలిపారు. గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్ సభ్యుడు ఏలె భిక్షపతి, వినోబా మందిరం ఉపాధ్యక్షుడు కొయ్యడ నర్సింహ, కార్యదర్శి మురళి, భాస్కర్ పాల్గొన్నారు.


### ఆకు కూరలతోనే ఆరోగ్యం : సూపర్‌వైజర్ షమీమ్

గుండాల, ఏప్రిల్ 16 : ఆకు కూరలు తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షమీమ్ అన్నారు. పోషణ పక్షంలో భాగంగా మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, తల్లులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషకాలు, విటమిన్లు కలిగిన ఆహారం తీసుకోవడం వల్ల పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందన్నారు. బాలింతలు ఐరన్, కాల్షియం ఉన్న ఆహారం తీసుకోవాలని సూచించారు. అనంతరం పలువురికి సీమంతం చేశారు.

### ప్రాథమిక పాఠశాలకు టీవి బహూకరణ

రాజాపేట : మండల కేంద్రంలోని హరిజనవాడ ప్రాథమిక పాఠశాలకు బుధవారం ఆ పాఠశాలలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన కొంజేటి కరుణకుమారి రూ.20వేల విలువ గల స్మార్ట్ టీవీని బహూకరించారు. ఆమెకు ఎంఈఓ చందా రమేశ్, ప్రధానోపాధ్యాయుడు సట్టు జయంత, ఆకుల భాస్కర్, ధనలక్ష్మి, ఎంఐఎస్ కో ఆర్డినేటర్ ఎర్రగోకుల నాగార్జున అభినందనలు తెలిపారు.


## 'మోడల్ స్కూల్ అవుట్‌సోర్సింగ్ సిబ్బంది వేతనాలు చెల్లించాలి'



మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌కు విధుల బహిష్కరణ పత్రం అందజేస్తున్న అవుట్ సోర్సింగ్ సిబ్బంది

బొమ్మలరామారం, ఏప్రిల్ 16 : మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ సిబ్బందికి పెండింగ్ వేతనాలు చెల్లించాలని అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కమిటీ సభ్యుడు కానుగంటి లక్ష్మణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మోడల్ స్కూల్‌లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ సిబ్బంది తమకు నాలుగు నెలల వేతనాలు వచ్చేవరకు విధులను బహిష్కరించి నిరసన తెలుపుతున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ యెనీమాకు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏజెన్సీ వ్యవస్థను రద్దు చేసి ప్రభుత్వం నేరుగా వేతనాలను ప్రతి నెలా అందించాలని కోరారు. గురువారం నుంచి వేతనాలు చెల్లించే వరకు విధులను బహిష్కరిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం మానవతా దృక్పథంతో తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో వరుగంటి యాదయ్య, వెంకటేశ్ పాల్గొన్నారు.

## ఉపాధి కల్పనలో ప్రభుత్వాలు విఫలం : డీవైఎఫ్ఐ



వెల్లంకిలో మాట్లాడుతున్న మధుకృష్ణ

రామన్నపేట, ఏప్రిల్ 16 : ఉపాధి కల్పనలో పాలక ప్రభుత్వాలు విఫలమయ్యాయని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పల్లె మధుకృష్ణ, గడ్డం వెంకటేశ్ అన్నారు. యవతకు గంజాయి, ఆన్‌లైన్ బెట్టింగ్ మాన్పించి ఉపాధి అవకాశాలు కల్పించాలని జిల్లా వ్యాప్తంగా చేపట్టిన సైకిల్ యాత్ర రెండో రోజు బుధవారం మండలంలోని వెల్లంకి గ్రామానికి చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేకపోవడంతో అనేక మంది యువకులు గంజాయి, బెట్టింగ్, డ్రగ్స్‌కు అలవాటుపడి భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారన్నారు. జిల్లా వ్యాప్తంగా ఏడు రోజులపాటు జరిగే యువ చైతన్య సైకిల్ యాత్రకు ప్రజలు మద్దతు పలుకాలని కోరారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు వనం ఉపేందర్, కవిడె సురేశ్, జగన్, మహేశ్, శ్రవణ్, సంతోష్, గిరి, పవన్‌కళ్యాణ్ పాల్గొన్నారు.